క్లుప్తంగా

వైభవంగా దండు మారెమ్మ జాతర



దండు మారెమ్మ ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ

గణపవరం: గణపవరం గ్రామ దేవత శ్రీ దండు మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం అమ్మవారిని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శనివారం రాత్రి నిర్వహించిన గవళ్లగుడుపు సేవలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి ఆసాదులు గరగలసేవ నిర్వహించారు. ఆలయం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు ఏర్పాటు చేశారు. రాత్రి అద్దాల విష్ణు ఆధ్వర్యంలో కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

ఘనంగా సింగమ్మ తల్లి వార్షిక ఉత్సవాలు



పుట్టింటి వద్ద పూజలు అందుకుంటున్న సింగమ్మ తల్లి

ఉంగుటూరు : కైకరం పడమర వీధిలో వేంచేసి ఉన్న సింగమ్మతల్లి వార్షిక ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పుట్టిల్లు అయిన అద్దేపల్లి శేషయ్య ఇంటి వద్దకు తీసుకువచ్చారు. మహిళలు అమ్మవారికి పూజలు చేశారు. దూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఊరేగింపుగా గ్రామపురవీధుల్లో మేళతాళాలతో అమ్మవారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అద్దేపల్లి శేషయ్య, పుప్పాల గోపి, కోనా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



కైకరం హైస్కూల్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: కై కరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. వెనుకబడి ఉన్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ఫీజు పోరు ధర్నాకు సిద్ధం



డీఎన్నార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కామిరెడ్డి నాని

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావును ఆదివారం ఆయన కార్యాలయంలో పార్టీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని కలిశారు. దెందులూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వేధింపులతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులు వివరించారు. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టనున్న ఫీజు పోరు ధర్నాకు యువజన విభాగం జిల్లా నియోజకవర్గ మండల, గ్రామ కమిటీల ఏర్పాటు కార్యక్రమంపై చర్చించారు. ఆయన వెంట శ్రీరామవరం పార్టీ గ్రామ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, రామారావుగూడెం గ్రామ సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్, నాయకులు ఉన్నారు.

ఇంటింటా సర్వే

దెందులూరు: కుష్టు వ్యాధితోపాటు సంక్రమిత వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం పోతునూరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా ఏఎన్‌ఎంలు, ఆశా సిబ్బంది కుష్టు వ్యాధి, సంక్రమిత వ్యాధుల లక్షణాలపై సర్వే నిర్వహించారు. రంగులేని స్పర్శలేని మచ్చల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సంక్రమిత వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన వైద్య చికిత్సపై ఏఎన్ఎంలు అవగాహన కల్పించారు. సర్వేను డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఎంపీహెచ్ఓ హరి పరిశీలించారు.

సాగునీటి గండం

- గుండుగొలను ఆయకట్టుకు అందని సాగునీరు
- నెర్రలు విడిచిన పంట చేలు
- పొట్ట దశలో చేలకు నీరందించాలని రైతుల మొర



నెర్రలు విడిచిన పుల్లయ్య బోదెలోని పొలాలు



గుండుగొలను డొంక బోదెలో సాగునీరు లేక పొట్ట దశలో ఎండిపోతున్న పంటను నీటి సంఘం ప్రతినిధులకు చూపిస్తున్న కౌలు రైతు నాగం నరసింహులు

భీమడోలు: గోదావరి కాల్వ శివారు గుండుగొలను దాళ్వా ఆయకట్టు సాగునీటి గండం నుంచి గట్టెక్కేలా లేదు. వంతుల వారీ విధానంతో ప్రతి గింజకు సాగునీరు అందించాల్సిన సంబంధిత అధికారులు, పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో పొలాలకు సాగునీరు అందడం లేదు. దీంతో ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న చేలు నీరందక నెర్రలు విడిచి ఎండిపోయే ప్రమాదం ఉంది. పరిస్థితి ఇలానే కొనసాగితే చేలు ఎండిపోయే తాము తీవ్ర నష్టాల్లో కూరుకుపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. సార్వాలో పంటకు పెట్టిన పెట్టుబడులకు రాలేదని, దాళ్వాపై ఆశ పెట్టుకుంటే సాగునీటి ఎద్దడి పెద్ద సమస్యగా మారిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

అధికారులకు ఫిర్యాదు

గుండుగొలను సెక్షన్ పరిధిలోని పంట చేలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, చివరి దశలో ఉన్న పంటకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని భీమడోలు మాజీ ఏఎంసీ చైర్మన్ వగ్వాల భాస్కర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మెరక తూములకు నీరందించేందుకు కృషిచేస్తామని నీటి సంఘం అధ్యక్షుడు డోకల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కె.సోమేశ్వరరావుతెలిపారు. డొంక బోదెతో పలు బోదెలు ఎత్తు గా ఉండడంతో నీరుపారక ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని నీరు అందించేందుకు కృషి చేస్తామని ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి ఎకరాకూ సాగునీరు

గత వైఎస్సార్ సీపీ హయాంలో సాగునీటి ఇబ్బందులులేవు. పంటలకు సాగునీరు పుష్కలంగా అందించేందుకు అవసరమైతే సీలేరు జలాలను సైతం పంపిణీ చేసి ఆయకట్టుకు సాగునీటిని అందించేవారు. దీనితో ఆశాజనమైన దిగుబడులతో రైతులు సంతోషంగా ఉండేవారు. అయితే కూటమి ప్రభుత్వ పాలనలో సాగునీటి కష్టాలు మళ్లీ మొదటికివచ్చాయి. వాస్తవానికి వంతుల వారీ విధానం అమలులో ఉండడంతో వంతు వచ్చిన ఆయకట్టుకు నీరందించాల్సి ఉంది. గత నెల 19వ తేదీ నుంచి ఇప్పటి వరకు వంతుల వారీ విధానంలో కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, కర్రనాచులు, తూడు వల్ల కాల్వలో నీటి మట్టాలు అడుగంటాయి. దీనితో సాగునీరు పంటచేలకు సక్ర మంగా చేరలేదు. గుండుగొలనులోని డొంక బోదె, పంటచేను బోదె, పుల్లయ్య బోదెల్లోని పంటలకు నీరు చేరక నెర్రలు విడిచాయి. ప్రస్తుతం కాల్వలో నీటి మట్టాలు పెరగ్గా ఆయకట్టుకు వంతు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండల తీవ్రత వల్ల నీరు ఆవిరై పోతుందని, వెంటనే నీరు ఇంకిపోతుందని వాపోతున్నారు. దీనితో ఆయుకట్టులోని వెయ్యి ఎకరాల్లోని పంట దెబ్బతింటుందని, దిగుబడుల తగ్గి కౌలు రైతులు భారీగా నష్టపోతామని గగ్గోలు పెడుతున్నారు.

13 నుంచి కల్యాణ మహోత్సవాలు

దెందులూరు: సోమవరప్పాడులోని శ్రీ జనార్ధన స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాలు ఈ నెల 13 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త చలసాని శ్రీధర్ తెలిపారు. సమీప గ్రామాల్లోని భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

సీతారామస్వామికి విశేష పూజలు



స్వామి వారికి శాంతి కల్యాణం చేస్తున్న దృశ్యం

భీమడోలు: గుండుగొలనులో ప్రసిద్ధిగాంచిన శ్రీసీతారామస్వామి ఆలయంలో ఆదివారం ఫాల్గుణ మాసం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి వారి ఉత్సవ మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ కొండ గంగరాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ పూజారి సుధీరాచార్యులు స్వామివార్లకు స్నపన, శాంతి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వైభవంగా భీమేశ్వరస్వామి కల్యాణం



విద్యుత్ వెలుగుల్లో భీమేశ్వరస్వామి ఆలయం

నిడమర్రు: పెదనింద్రకొలను గ్రామంలోని స్వయంభూ శ్రీపార్వతీ సమేత భీమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. కూనపురాజు సోమరాజు దంపతులు పీటపై కూర్చోగా స్వామి వారి కల్యాణాన్ని పండితులు కై తేపల్లి బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం స్వామి వారి రథోత్సవం అనంతరం నాని ఆర్కెస్ట్రా సినీ మ్యూజికల్ నైట్, 11న చింతామణి నాటం, 12న స్వామి వారి చోరోత్సవం, తెప్పోత్సవం అనంతరం మోహన్ ఆర్కెస్ట్రా, 13న వెంకి ఆర్కెస్ట్రా, 14న వెరైటీ బుర్రకథ, 15న సర్వసుధ ఆర్కెస్ట్రా, 16న 50 కిలోల లడ్డూ వేలంపాట అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మేకా వెంకటరమణ, ఈవో వి. చంద్రశేఖర్ తెలిపారు. ఆలయ ప్రాంగణంతోపాటు గ్రామ వీధుల్లో విద్యుత్ అలంకరణ ఆకట్టుకుంది.



స్వామివారికి కల్యాణం నిర్వహించిన దృశ్యం

బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న పోస్టల్ జిల్లా సూపరింటెండెంట్

దెందులూరు: స్థానిక పోస్టాఫీస్‌లో రూ.10 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు పోస్టల్ జిల్లా సూపరింటెండెంట్ శ్రీకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ 9న ఫ్రిజ్‌లో బాటిల్ తీసుకుంటుండగా విద్యుత్ షాక్‌తో మరియమ్మ మృతి చెందిందని తెలిపారు. ఆమె పోస్టల్‌లో రూ.396తో ప్రీమియం తీసుకోవడం వలన ఆమె మరణానంతరం కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెక్ మంజూరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పోస్టల్ ఐపీఓ దెందులూరు పోస్టుమాస్టర్ వెంకట్ సురేష్ పాల్గొన్నారు.

హోంగార్డ్ నిజాయతీ



జాతరలో దొరికిన వెండి ఆభరణాన్ని కమిటీ సభ్యులకు అందజేస్తున్న హోంగార్డ్

భీమడోలు: విధి నిర్వహణలో ఉన్న ఓ హోంగార్డ్ తనకు దొరికిన వెండి ఆభరణాన్ని కమిటీ సభ్యులకు అందించి నిజాయతీ చాటుకున్నారు. వివరాల ప్రకారం భీమడోలులో జరిగిన జాతరలో సీఐ యూజే విల్సన్ పర్యవేక్షణలో ఎస్సై వై.సుధాకర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. జాతరలో పడిపోయిన ఓ భక్తురాలి వెండి ఆభరణం శనివారం రాత్రి విధుల్లో ఉన్న హోంగార్డుకు దొరకగా ఆయన దానిని జాతర కమిటి నిర్వాహకులు కరణం పెద్దిరాజు, ఆల్తి శ్రీనివాస్, వాసులకు అందించారు. ఈ సందర్భంగా హోంగార్డును జాతర కమిటీ సభ్యులు అభినందించారు.

పేదోడి ఫ్రిజ్‌కు భలే గిరాకీ



విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి కుండలు

పెదవేగి : అప్పుడే ఎండలు భగభగ మండుతున్నాయి... గొంతులు తడారుతున్నాయి... ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ముఖ్యంగా చల్లటి నీటి కోసం ప్రజలు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో పేదొడి ఫ్రిజ్ (కుండ)కు డిమాండ్ పెరిగింది. ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిదన్న భావనతో మట్టి కుండలను కొనుగోలు చేసేందుకు ప్రజలు అసక్తి చూపుతున్నారు. మండలంలోని కూచింపూడి, వేగివాడ, విజయరాయి, భోగాపురం, పెదవేగి, కొప్పాక, తదితర ప్రాంతాల్లో కుండలు విక్రయిస్తున్నారు. కుండ సైజును బట్టి రూ 80 రూపాయల నుంచి 160 వరకు విక్రయిస్తున్నారు.

నేటినుంచి దీవెన పండుగలు

దెందులూరు: కొవ్వలిలోని కొత్తపేటలో ఈనెల 10, 11, 12 తేదీల్లో బేతేలు సువార్త సహవాసం సంఘం ఆధ్వర్యంలో దీవెన పండుగలు నిర్వహిస్తున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి నలుగురు సువార్తికులు వాక్య పరిచర్య కోసం విచ్చేస్తారని సమీప గ్రామాల్లోని విశ్వాసులు కొవ్వలి దీవెన పండుగకు హాజరుకావాలని కోరారు.

జూదరుల అరెస్ట్

పెదపాడు: మండలంలోని తోటగూడెం గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. ఈ దాడిలో నలుగురు జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.4600 స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద నిరసన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హిందువులపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులకు వ్యతిరేకంగా సోమవారం ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు హిందూ సంఘాల ఐక్యకార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రామనపూడి శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 4న అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో నిర్వహిస్తున్న పారేటి గ్రామ ఉత్సాహం (ఊరేగింపు)లో ముస్లింలు అకారణంగా హిందువులపై రాళ్లు రువ్వడం దారుణమన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏజెంట్ల యూనియన్ నాయకులు

పెదపాడు: ఎల్ఐసీ ఏజంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కు ఏలూరు జిల్లా ఎల్ఐసీ ఏజంట్ల యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఎల్ఐసీ యాజమాన్యం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాల కారణంగా దేశ వ్యాప్తంగా ఉన్న 13లక్షలకు పైగా ఉన్న ఏజంట్ల మనుగడకే ముప్పు వాటిల్లిందని, ప్రైవేటు సంస్థల ప్రభావంతో ఎల్ఐసీ ఎన్నడూ లేనంతటి తీవ్ర సంక్షోభానికి గురవుతోందని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. పాలసీ హోల్డర్స్‌కి ఏయేటికాయేడు బోనస్ తగ్గించి వేస్తుంటం ఏజంట్ల కమీషన్ శాతం గణనీయంగా తగ్గించడం బ్యాంకుల్లో ప్రజల నుంచి బలవంతంగా పాలసీలు కట్టించడం లాంటి ఎన్నో ఏజంట్ల వ్యతిరేక నిర్ణయాలు అమలు చేస్తున్న కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ వ్యాపారం అనూహ్యంగా పడిపోయిందని ఎంపీకి వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉన్న ఎల్ఐసీ సంస్థను కాపాడుకోకపోతే భవిష్యత్‌లో ఎన్నో ఆర్థిక విపత్తులు ఎదుర్కొనక తప్పదని యూనియన్ నాయకులు వివరించారు. విషయాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఎంపీ మహేష్‌యాదవ్ చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో ఏలూరు ఎల్ఐసీ ఏజంట్స్ యూనియన్ అధ్యక్షుడు వడ్డి త్రివేణి కుమార్ కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు, కోశాధికారి ఎంపీఎస్ రాజు, సుంకర హరనాథ్, వివి శివరామకృష్ణ, మండపాటి వెంకటేశ్వరావు, సతీష్, పీఎస్ భాస్కర్, బీవీవీ సత్యన్నారాయణ, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బస్సుల కోసం నిరీక్షణ



భీమడోలు బస్టాండ్ బయట బస్సుల కోసం ఎదురుచూస్తున్న జనం

భీమడోలు: భీమడోలు జాతర ఉత్సవానికి జిల్లాతోపాటు పొరుగు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం తిరిగి తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సుల కోసం పడిగాపులు పడ్డారు. గంటల కొద్దీ ఎండలో నిలబడి బస్సుల కోసం ఎదురు చూసినా బస్సులు రాకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. మహా జాతర జరుగుతున్న వేళ.. కనీసం ఆర్టీసీ యాజమాన్యం బస్సు సర్వీసులు పెంచకపోవడంతో వారంతా యాజమాన్యం తీరును బాహాటంగానే విమర్శిస్తున్నారు.

మద్యం దుకాణాల వద్ద రద్దీ

భీమడోలు జంక్షన్‌లోని జాతీయ రహదారికి ఇరువైపులా బ్రాందీ షాపులు, మాంసపు దుకాణాలు, బిర్యానీ పాయింట్లు ఉండడంతో ఆ ప్రాంతమంతా జనంతో నిండిపోయింది. మద్యం దుకాణాల వద్ద బైక్‌లు ఎక్కువగా నిలిచిపోవడంతో రద్దీ ఏర్పడింది. దీనితో మందుబాబులను తప్పించుకుని వెళ్లేందుకు జనం ఇబ్బందులు పడ్డారు. జాతర కావడంతో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి.

వైభవంగా వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన వేణుగోపాలస్వామి విగ్రహం

నిడమర్రు: బువ్వనపల్లి జగ్గయ్య చెరువు వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ వేణుగోపాల స్వామి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభంగా జరిగింది. ఉదయం 8.15 గంటల నుంచి ప్రధాన, నిత్య హోమాలు, ప్రాణ ప్రతి ష్ఠ, మహా పూర్ణాహుతి వంటి పూజలు నిర్వహించారు. చానమిల్లి రహదారిలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఆలయ బృందం శోభయాత్రగా వచ్చి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో 10 వేలమంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టీటీడీ మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు గాదిరాజు వెంకట సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్యే వాసుబాబు సోదరులు చినబాబు, కన్నబాబు, కార్తీక్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సంకు పుల్లయ్య, సంకు నాగేషు, సంకు కృష్ణాజీ పాల్గొన్నారు.

పీ4 సర్వేతో పథకాలకు కోత!

- గ్రామాల్లో ప్రారంభమైన పీ 4 సర్వే
- ఈనెల 18 వరకూ డోర్ టూ డోర్ సర్వే
- పథకాలు తొలగిస్తారేమోనని లబ్ధిదారుల ఆందోళన



చినరామచంద్రపురంలో సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి

నిడమర్రు: గ్రామ, వార్డు సచివాలయాల్లోని హౌస్‌హోల్డ్ జాబితాలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదులేకపోతే వారిని ప్రభుత్వ పథకాల నుంచి తొలగించనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పీ4 సర్వే ఈనెల 8వ తేదీ నుంచి అధికారులు ప్రారంభించారు. ఈనెల 18వ తేదీ వరకూ గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఆయా కుటుంబ సభ్యుల వివరాలు ఆర్థిక స్థితిగతలు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాలకు అర్హులను నిర్ధారించేందుకు ఈ సర్వేను పరిగణనలోకి తీసుకోనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఉగాది నుంచి పీ4 సర్వే పథకం రూపంలో అమల్లోకి రానున్నట్లు ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రకటించింది. పీ4 సర్వేలో నమోదు చేసిన వివరాలు ఆయా గ్రామ సచివాలయల్లో ఈ నెల 21న ప్రదర్శిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పీ4తో లబ్ధిదారుల్లో కోత

పీ4 అంటే పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్. ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు, కలసి భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం అని ప్రభుత్వం చెబుతోంది. దీంతో పేదరికం నిర్మూలిస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ పీ4 సర్వేతో ప్రస్తుతం ఉన్న లబ్ధిదారులను కుదించే అవకాశం ఎక్కువగా ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం పథకాలు అందుతున్న వారం దరూ ఈ పీ4 సర్వేతో వారిపై అనర్హత వేటు పడుతోందని ఆందోళన చెందుతున్నారు. పీ4తో రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించేందుకే అని చంద్రబాబు సర్కారు చెబుతున్నా

ఉంగుటూరు నియోజకవర్గ వివరాలు

మండలం	సచివాలయాలు	సర్వే కుటుంబాల సంఖ్య
గణపవరం	20	18,413
నిడమర్రు	14	13,335
ఉంగుటూరు	25	23,708
భీమడోలు	17	19,080

క్షేత్రస్థాయిలో ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెబుతున్నారు. సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది పేదరికంలో అట్టడుతున్న 20 శాతం పేదలను దత్తత తీసుకోవడం సాధ్యమా అని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఉగాది నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం పరుగులు పెట్టిస్తున్నారు. ఆదివారం కూడా ఈ ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది ఈ సర్వేలో పాల్గొన్నారు. 4 రోజుల్లో ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలంటూ ఉన్నత అధికారులనుంచి ఒత్తిడి ఉందని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు.

27 ప్రశ్నలు ఆన్‌లైన్‌లో నమోదు

సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్లి వారి కుటుంబ వివరాలు, సామాజిక ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన 27 ప్రశ్నల ద్వారా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో సేకరిస్తున్నారు. ఇంటి యజమాని పేరు, కుటుంబ సభ్యుల వివరాలు ఇంట్లో సంపాదన పరులు ఎంతమంది, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా, ఇల్లు ఏ రకం, బ్యాంక్ ఖాతా వివరాలు, పట్టణంలో స్థలం ఉందా, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయా, రక్షిత తాగునీరు సరఫరా అవుతోందా, ఇంట్లో గృహోపకరణాల సమాచారం, వంటగ్యాస్ వినియోగిస్తున్నారా, నెలకు కరెంటు బిల్లు ఎంత వస్తుంది, గత రెండేళ్లలో ఆదాయపు పన్ను చెల్లించారా.. ఈ విధంగా మొత్తం 27 ప్రశ్నలతో పీ4 యాప్ రూపొందించారు.

> **20 గ్రామాల్లో చురుగ్గా సాగుతోంది**
>
> పీ4 సర్వే మండలంలోని 20 గ్రామాల్లో ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభించాం. ఆదివారం కూడా సచివాలయ ఉద్యోగులు ఈ సర్వేలో పాల్గొన్నారు. గణపవరంలోని 2 సచివాలయాల్లో నేను పర్యటించి సర్వే తనఖీ చేశాను. మండలంలో మొత్తం 18,413 కుటుంబాల వివరాలు నమోదు చేయాల్సి ఉంది.
>
> – ఆర్. బేబీ శ్రీలక్ష్మి, ఎంపీడీవో, గణపవరం

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో రాట్నాలమ్మ తల్లి

పెదవేగి : రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారికి పూజా రుసుముపై రూ.31,800, విరాళాల రూపంలో రూ.33,160, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ 22,725, ఫొటోల అమ్మకంపై రూ.2600, మొత్తం రూ.90,285 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్ చెప్పారు.